
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
07-1-2025 (Wednesday) MAIN EDITION

## ఐబొమ్మ రవి బెయిల్ పిటిషన్ను కొట్టివేత




**అక్షరటుడే, హైదరాబాద్:** ఐబొమ్మ రవికి నాంపల్లి కోర్టు షాక్ ఇచ్చింది. అతడి బెయిల్ పిటిషన్‌ను జడ్జి కొట్టివేశారు. సినిమా పైరసీ కేసులో ఇమ్మడి రవిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని రవి కోర్టును ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు దశలో ఉందని పోలీసులు కోర్టుకు తెలిపారు. అతడికి విదేశాల్లో పౌరసత్వం ఉందని చెప్పారు. బెయిల్ ఇస్తే దేశం దాటి పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. పోలీసుల వాదనతో ఏకీభవించిన కోర్టు రవి బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

## నా పట్ల మోదీ సంతోషంగా లేరు: ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంతోషంగా లేరన్నారు. తనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో చాలా మంచి సంబంధం ఉందని ట్రంప్ చెప్పారు. అయితే తాము విధించిన అధిక సుంకాలపై భారత నాయకుడు తనపై అసంతృప్తితో ఉన్నారని అంగీకరించారు. హౌస్ జీవోపీ సభ్యుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఇరు దేశాల సంబంధాలలో ఉన్న ఒత్తిడిని ప్రస్తావించారు. భారత్ రష్యా నుంచి చమురు దిగుమతులను గణనీయంగా తగ్గించిందని మరోసారి చెప్పారు.

## వైసీపీ వల్లే పోలవరం ఆలస్యం



**అక్షరటుడే, ఏపీ:** గత వైసీపీ ప్రభుత్వం వల్లే ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడానికి ఆరేడు ఏళ్లు ఆలస్యమైందని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టు పరిశీలన అనంతరం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పాకే డయాఫ్రం వాల్ పాడైందని గత ప్రభుత్వంలోని వారికి తెలిసిందన్నారు.

## కొత్త పార్టీ మనుగడ కష్టం: గుత్తా



**అక్షరటుడే, హైదరాబాద్:** కవిత విజ్ఞప్తి చేయడంతోనే ఆమె రాజీనామాను ఆమోదించినట్లు తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. కవిత కొత్త పార్టీ ప్రకటనపైనా గుత్తా స్పందించారు. రాష్ట్రంలో కొత్త పార్టీ వచ్చినా మనుగడ కష్టమన్నారు. గతంలో వచ్చిన పలు పార్టీలు కనుమరుగయ్యాయని చెప్పారు.

## నష్టాల్లోనే స్టాక్‌మార్కెట్ సూచీలు



**అక్షరటుడే, ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిశాయి. భౌగోళిక ఉద్రిక్తతలు, ట్రంప్ టారిఫ్ హెచ్చరికలు ప్రతికూల ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 102.20 పాయింట్ల నష్టంతో 84,961.14 వద్ద ముగిసింది. నిఫ్టీ 37.95 పాయింట్ల నష్టంతో 26,140.75 వద్ద స్థిరపడింది.

## ఆర్ఎఫ్‌సీఎల్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్..




**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదలైంది. 36 పోస్టులను భర్తీ చేయనున్నారు. మేనేజిరియల్ పోస్టుల భర్తీ కోసం ఆర్ఎఫ్‌సీఎల్ నోటిఫికేషన్ విడుదల చేసింది. సంస్థకు సంబంధించిన రామగుండం ప్లాంట్‌తోపాటు నొయిడా కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, ఐటీ తదితర విభాగాల్లో జనరల్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్, చీఫ్ మేనేజర్, మేనేజర్, సీనియర్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టులను భర్తీ చేయడం కోసం అర్హులైనవారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పూర్తి వివరాలకు https://www.rfcl.co.in వెబ్‌సైట్‌లో సంప్రదించండి.

## సీఎం స్టాలిన్‌కు షాక్..

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** తమిళనాడులో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా పార్టీలు తీవ్రంగా కసరత్తు చేస్తున్నాయి. తమిళనాడులో మార్చి, ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. డీఎంకే పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉంది. అయితే తమిళనాడులో ఎలాగైనా గెలవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రతిపక్ష ఏఐడీఎంకేతో పొత్తు పెట్టుకుంది. తాజాగా ఆ కూటమిలోకి మరో పార్టీ చేరింది. పట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) పార్టీ డీఎంకేకు షాక్ ఇచ్చి ఎన్డీఏలో చేరింది.

**ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు పెంచింది. కొన్ని రోజులుగా నెమ్మదిగా సాగుతున్న విచారణ సిట్ ఏర్పాటు తర్వాత వేగం అందుకుంది. బీఆర్ఎస్ ముఖ్య నాయకు లకు సిట్ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్సీ నవీన్‌రావును సుదీర్ఘంగా విచారించిన సిట్.. తాజాగా ఆయన తండ్రితో పాటు మరికొందరికి నోటీసులు ఇచ్చింది. దీంతో ఈ కేసులో త్వరలో అప్పటి ప్రభుత్వ పెద్దలను సైతం విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# సిట్ దూకుడు..

- ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ వేగవంతం
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు
- ఎమ్మెల్సీ తండ్రి, ఎమ్మెల్యే కుమారుడికి సైతం..
- సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడికి కూడా..

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతిపక్ష నాయకులతో పాటు వ్యాపారులు, జడ్జిలు, సినీ ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు కీలకంగా వ్యవహరించారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2024 మార్చిలో ఫోన్ ట్యాపింగ్‌పై కేసు నమోదు అయింది. పలువురు అధికారులను అరెస్ట్ చేసి విచారించారు. ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావును సైతం అధికారులు విచారించారు. ఈ కేసు ఎంతకు కొలిక్కి రాకపోవడంతో ప్రభుత్వం ఇటీవల సిట్ ఏర్పాటు చేసింది. దీనికి హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వం వహిస్తున్నారు. సిట్ అధికారులు ప్రభాకర్‌రావును కస్టడీకి తీసుకొని కీలక సమాచారం సేకరించారు. ఈ మేరకు పలువురు బీఆర్ఎస్ నేతలకు నోటీసులు ఇస్తున్నట్లు తెలుస్తోంది.

### ఎమ్మెల్సీ తండ్రికి..

సిట్ అధికారులు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌రావును ఇటీవల సుదీర్ఘంగా విచారించింది. దాదాపు 8 గంటల పాటు ఆయనను ప్రశ్నించారు. నవీన్ రావు తండ్రి కొండలరావుకు సైతం నోటీసులు ఇచ్చారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు విచారణకు హాజరు కావాలని సూచించారు. అయితే ఆయన విచారణకు గైర్హాజరు అయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా తన నివాసంలోనే విచారణకు సిద్ధమని సిట్ అధికారులకు తెలిపినట్లు సమాచారం. మరోవైపు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్ రావుకు సైతం నోటీసులు ఇచ్చారని ప్రచారం జరిగింది. అయితే ఆయనకు ఎలాంటి నోటీసులు రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఒకవేళ నోటీసులు వస్తే విచారణకు సిద్ధమని వెల్లడించారు. ప్రస్తుతం సందీప్ రావు విదేశాల్లో ఉన్నట్లు సమాచారం.

### ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలకు..

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, చిరుమూర్తి లింగయ్యకు సైతం అధికారులు నోటీసులు ఇచ్చారు. గురువారం ఉదయం 11 గంటలకు హాజరుకావాలని ఆదేశించారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డికి సైతం నోటీసులు జారీ చేశారు. రేవంత్‌రెడ్డి కామారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కొండల్ రెడ్డి అన్ని తానై వ్యవహరించారు. అక్కడ కేసీఆర్ కూడా పోటీ చేయడంతో కొండల్‌రెడ్డి ఫోన్ ట్యాప్ చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆయనకు నోటీసులు ఇచ్చిన అధికారులు గురువారం ఉదయం స్టేట్‌మెంట్ రికార్డు చేయనున్నారు. ఈ కేసులో త్వరలోనే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును సైతం విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు సమాచారం.



## భారత్‌లో తొలి హైడ్రోజన్ రైలు..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత్‌లో తొలి హైడ్రోజన్ రైలు త్వరలో పరుగులు పెట్టనుంది. హర్యానాలోని జింద్‌సోనీపత్ మధ్య సేవలు అందించడానికి సిద్ధం అయింది. హర్యానాలోని జింద్‌సోనేపట్ మార్గంలో హైడ్రోజన్ శక్తితో నడిచే రైలు త్వరలో ప్రారంభించనున్నారు. ఉత్తర రైల్వే ఆధ్వర్యంలో దీనిని రూపొందించారు. హైడ్రోజన్ రైలు జింద్ - సోనేపట్ మధ్య 89 కి.మీ.ల దూరం నడుస్తోంది. జింద్‌లో ఏర్పాటు చేసిన గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ద్వారా శక్తిని పొందుతుంది. ఇక్కడ దేశంలోనే అతిపెద్ద హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. 3వేల కిలోగ్రాముల నిల్వ సామర్థ్యంతో ఈ ప్రాజెక్ట్ కోసం ప్రత్యేకంగా తయారు చేశారు. హర్యానా ప్రధాన కార్యదర్శి అనురాగ్ రస్తోగి చండీగఢ్‌లోని దక్షిణ హర్యానా బిజ్లీ విత్రాన్ నిగమ్ అధికారులతో విద్యుత్ ఏర్పాట్లను సమీక్షించారు.

## కాంగ్రెస్ నేత సునీల్ రెడ్డి అరెస్ట్



**అక్షరటుడే, హైదరాబాద్:** జీఎస్టీ ఎగవేత కేసులో కాంగ్రెస్ నాయకుడు అరెస్ట్ అయ్యారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్‌రెడ్డిని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఆరెంజ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీగా కొనసాగుతున్నారు. సునీల్‌రెడ్డి రూ.28 కోట్ల జీఎస్టీ ఎగవేశారని అధికారులు గుర్తించారు. మూడు నెలల గడువు ముగిసినా జీఎస్టీ చెల్లించకపోవడంతో తాజాగా జీఎస్టీ చట్టం 2017 ప్రకారం అరెస్ట్ చేశారు. రూ.28.24 కోట్ల జీఎస్టీని వినియోగదారుల నుంచి వసూలు చేసినా ఆయన దానిని ప్రభుత్వానికి చెల్లించలేదని అధికారులు పేర్కొన్నారు.

## లొంగిపోయిన 26 మంది మావోయిస్టులు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** మావోయిస్టులకు మరో షాక్ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లో తాజాగా 26 మంది నక్సల్స్ లొంగిపోయారు. సుక్మా జిల్లాలో బుధవారం 26 మంది నక్సలైట్లు లొంగిపోయారని, వీరిలో 13 మందిపై రూ. 65 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. ఇందులో ఏడుగురు మహిళలు ఉన్నారు. "పూనా మార్గెం" కార్యక్రమం కింద సీనియర్ పోలీసు, సీఆర్‌పీఎఫ్ అధికారుల ముందు వీరు లొంగిపోయారని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. లొంగిపోయిన వారిలో హేమ్లా లఖ్మా (41), ఆస్మిత అలియాస్ కమ్లు సన్నీ (20), రాంబతి అలియాస్ పదం జోగి (21), సుందమ్ పాలే (20) తదితర కీలక నేతలు ఉన్నారు.

## చిరు, ప్రభాస్ చిత్రాలకు హైకోర్టులో ఊరట

**అక్షరటుడే, సినిమాడెస్క్:** సంక్రాంతికి విడుదల కానున్న రాజాసాబ్, మన శంకర వరప్రసాద్ గారు సినిమాల నిర్మాతలకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. టికెట్ రేట్ల పెంపునకు సంబంధించిన వినతులపై నిర్ణయం తీసుకోవాలని కోర్టు సూచించింది. రాజాసాబ్, మన శంకర వరప్రసాద్ గారు చిత్రాలు సంక్రాంతి సందర్భంగా విడుదల కానున్నాయి. పెద్ద సినిమాలు కావడంతో టికెట్ల రేట్లు పెంచాలని నిర్మాతలు కోరుతున్నారు. అయితే ఇటీవల అఖండ-2 సినిమా టికెట్ల రేట్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దీంతో తాజాగా నిర్మాతలు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. నిర్మాతల వినతులపై నిర్ణయం తీసుకోవాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులు ఓజీ, గేమ్ ఛేంజర్, పుష్ప 2, అఖండ 2 సినిమాలకే వర్తిస్తాయని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.




## స్పెషల్ సాంగ్స్‌తో దుమ్మురేపుతున్న తమన్నా..

తెలుగు సినిమా పరిశ్రమలో కాలంతో సం బంధం లేకుండా క్రేజ్‌ను నిలబెట్టుకున్న హీరోయిన్లు చాలా అరుదు. అలాంటి జాబితాలో త్రిష వంటి సీనియర్ స్టార్స్ ఉంటే, ఇప్పుడు అదే బాటలో నడుస్తున్న మరో హీరోయిన్ మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా. ప్రధాన కథానాయికగా అవకాశాలు తగ్గినప్పటికీ, డిమాండ్ విషయంలో మాత్రం తమన్నా ఏమాత్రం తగ్గడం లేదు. స్పెషల్ సాంగ్స్‌తో దుమ్మురేపుతోంది. 'జైలర్' సినిమాలోని 'కావాలయ్యా' పాటతో తమన్నా మరోసారి దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఆ తర్వాత హిందీలో 'ఆజ్ కీ రాత్', తాజాగా 'రైడ్ 2' సినిమాలోని 'నషా' పాటతో సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పటికే 'రైడ్ 2'లోని స్పెషల్ సాంగ్‌కు సుమారు రూ.5 కోట్ల వరకు పారితోషికం అందుకున్నట్లు వార్తలు వచ్చాయి. గోవాలో జరిగిన ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో కేవలం 6 నిమిషాల డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌కు తమన్నా దాదాపు రూ.6 కోట్ల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

**– అక్షరటుడే, సినిమా డెస్క్**

## పర్యాటక అభివృద్ధి కోసమే కైట్ ఫెస్టివల్




**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలో టూరిజంని ప్రమోట్ చేయడం కోసమే స్వీట్, కైట్ ఫెస్టివల్, హాట్ ఎయిర్ బెలూన్ షో నిర్వహిస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. హైడ్రా పునరుద్ధరించిన చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్ జరుగుతుందన్నారు. కైట్, స్వీట్ ఫెస్టివల్‌పై మంత్రి జూపల్లి బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌కు వస్తున్న పర్యాటకులు రెండు మూడు రోజులు నగరంలో ఉండేలా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పర్యాటక శాఖ సంక్రాంతి పండుగ సందర్భంగా అంతర్జాతీయ గాలిపటాలు, స్వీట్స్ ఉత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ ఉత్సవం జనవరి 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనుందని చెప్పారు.

### వివిధ దేశాల నుంచి..

కైట్ ఫెస్టివల్‌లో 19 దేశాల నుంచి పలువురు పాల్గొంటారని చెప్పారు. 15 రాష్ట్రాల నుంచి 40 మంది అంతర్జాతీయ, 55 మంది జాతీయ గాలిపటాల నిపుణులు హాజరవుతారన్నారు. ఈ మూడు రోజులలో ప్రత్యేకంగా రూపొందించిన గాలిపటాలతో రాత్రిపూట ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. స్థానిక కళాకారులకు మద్దతుగా సుమారు 100 చేనేత, హస్తకళల స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. దాదాపు 60 ఫుడ్ కోర్టులు తెలంగాణ వంటకాలతో పాటు ఇతర ప్రాంతాల వంటకాలను అందిస్తాయి. స్వీట్ ఫెస్టివల్‌లో 1,200 రకాలకు పైగా స్వీట్లను ప్రదర్శించనున్నారు. జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ జరగనుంది. ఉదయం సెషన్‌లు హైదరాబాద్ శివార్లలో జరుగుతాయి. సాయంత్రం పరేడ్ గ్రౌండ్స్‌లో నైట్ గ్లో బెలూన్ ప్రదర్శనలు ఉంటాయని మంత్రి తెలిపారు. జనవరి 16, 17 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలో డ్రోన్ షో జరగనుంది.